క్లుప్తంగా

అధైర్య పడొద్దు అండగా ఉంటా..

ఎమ్మెల్యే హరీశ్‌రావు



భిక్షపతితో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని రాంపూర్ మాజీ సర్పంచ్ భిక్షపతి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సోమవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అధైర్య పడొద్దని, అన్ని రకాలుగా సహాయంగా ఉంటానని భరోసానిచ్చారు. ఆయన వెంట మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లింలకు హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణ, ధాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం విశిష్టత అని చెప్పారు.

మున్సిపల్ పాలకవర్గ సమావేశం

16 అంశాలకు మాత్రమే ఆమోదం



సమావేశమైన మున్సిపల్ పాలకవర్గం

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ సాధారణ పాలకవర్గ సమావేశం సోమవారం చైర్మన్ ఎన్సీ రాజమౌళి అధ్యక్షతన జరిగింది. కౌన్సిల్ హాలులో జరిగిన ఈ సమావేశంలో మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించి 35 అంశాలను ప్రతిపాదించగా, సభ్యులు 16 అంశాలకు మాత్రమే ఆమోదం పలికారు. మిగిలిన అంశాలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో కమిషనర్ గొల్కొండ నర్సయ్య, వైస్ చైర్మన్ జకీయొద్దీన్ పాల్గొన్నారు.

ప్రమాదాలు జరిగితే తీరని నష్టం



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ మురళి

గజ్వేల్‌రూరల్: వాహనదారులు ప్రతి ఒక్కరు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ మురళి పిలుపునిచ్చారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 45మందికి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదం జరిగితే ఆ కుటుంబానికి తీరని నష్టం జరుగుతుందన్నారు. ఓవర్ స్పీడ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారముందని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇతర ధ్రువపత్రాలు తప్పనిసరిగా తమవెంట ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ విజేత చెక్కపల్లి జట్టు



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న లింగమూర్తి

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పోతారం (ఎస్)లో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో రాజన్నసిరిసిల్ల జిల్లా చెక్కపల్లి జట్టు విజేతగా నిలిచింది. శనివారం, ఆదివారం జరిగిన ఈ పోటీలలో మొత్తం 50 జట్లు పాల్గొన్నాయి. ప్రథమ స్థానంలో చెక్కపల్లి, ద్వితీయ స్థానంలో పోతారం(ఎస్) జట్లు నిలిచాయి. టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి విజేతలకు బహుమతులు అందించారు. చదువులతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు ఉంటాయని, వాటిని యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజులారెడ్డి, చొల్లేటి శంకరయ్య, మాజీ సర్పంచ్ బత్తిని సాయిలు, ఎంపీటీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బైక్ దొంగ అరెస్ట్

చేర్యాల(సిద్దిపేట): ద్విచక్ర వాహన దొంగను 24గంటల్లో పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలో వీరన్నపేటకు చెందిన శ్రీకాంత్‌కు చెందిన బైక్ ఈ నెల 9న దొంగతనానికి గురైంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి బైక్ దొంగిలించిన వ్యక్తి పెద్దకోడూరుకు చెందిన శివకుమార్‌గా గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

మరుగు ఎప్పుడు మెరుగు?

- అసంపూర్తిగా టాయిలెట్లు
- ఇంటికో.. ఆరుబైటకో.. వెళ్లాల్సిందే
- పాడుబడిన భవనమే దిక్కు
- బాలికలు, టీచర్లకు నిత్యం తిప్పలు



అసంపూర్తిగా నిలిచిపోయిన టాయిలెట్ నిర్మాణం

తొగుట(దుబ్బాక): మండలంలోని ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టాయిలెట్‌ల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం, అధికారులు అలసత్వం వల్ల ఏడాది గడుస్తున్నా టాయిలెట్ల నిర్మాణం పూర్తి చేయని దుస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. టాయిలెట్ కోసం బాల బాలికలతో పాటు ఉపాధ్యాయులు కూడా ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి. పాఠశాల సమీపంలోని ఓ పాడుబడిన భవనంలోకి బాలికలు టాయిలెట్‌కు వెళ్తున్నారు. మరుగుదొడ్డికి వెళ్లాలంటే విద్యార్థులు ఇళ్లకు పరుగెత్తాల్సిన పరిస్థితి నెలకొంది. పాడుబడిన భవనంలో విషసర్పాలు తిరుగుతుండడంతో ఎప్పుడు ఏప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. బాలికలు ఆరుబయటకు వెళ్తుంటే మహిళా ఉపాధ్యాయులు కాపలాగా ఉండాల్సి వస్తోంది.

అధికారుల నిర్లక్ష్యం

పాఠశాలలో 151 మంది విద్యార్థులు ఉన్నారు. అందులో బాలికలు 68, బాలురు 83మంది. వారి సంఖ్యకు సరిపడా టాయిలెట్లు లేకపోవడంతో ప్రభుత్వం టాయిలెట్ల నిర్మాణం కోసం రూ.6లక్షలు మంజూరు చేసింది. దీంతో పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ పనులు పూర్తిచేయకుండా వదలేశాడు. ఏడాది గడుస్తున్నా టాయిలెట్ల నిర్మాణం పూర్తికాలేదంటే పంచాయతీరాజ్‌శాఖ అధికారుల నిర్లక్ష్యానికి అద్దంపడుతోంది. గ్రామస్తులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఫలితంలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి టాయిలెట్ల నిర్మాణం పూర్తిచేసి విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భయం భయంగా..



టాయిలెట్‌కు వెళ్లాలంటే పాఠశాల సమీపంలోని పాడుబడిన భవనంలోకి వెళ్తున్నాం. అందులో తరచు పాములు తిరుగుతున్నాయి. కొన్నిసార్లు మా ఉపాధ్యాయులు కాపలాగా ఉంటున్నారు. టాయిలెట్లు త్వరగా పూర్తిచేసి ఇబ్బందులు దూరం చేయాలి.

– నిక్షిత, 7వ తరగతి, విద్యార్థిని

అధికారుల దృష్టికి సమస్య

పాఠశాలలో టాయిలెట్లు నిర్మాణం పూర్తిచేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నది వాస్తవమే. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు దృష్టికి తీసుకువెళ్లాను. అయినప్పటికీ నిర్మాణ పనులు పూర్తికాలేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

– యాదవరెడ్డి, ఎంఈఓ తొగుట

నిధులు నిలిచిపోయాయి..

పాఠశాలలోని టాయిలెట్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.6లక్షలు మంజూరు చేసింది. దీంతో పాత టాయిలెట్లు కూల్చి నిర్మాణం చేపట్టాం. పనులు దాదాపు చివరి దశలో ఉన్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తాం.

– రామకృష్ణారెడ్డి, ఏఈ పంచాయతీరాజ్ శాఖ, తొగుట

తాగునీటి సమస్యలపై శ్రద్ధ చూపండి

ఎంపీపీ మాలోతు లక్ష్మి



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మి

అక్కన్నపేట(హుస్నాబాద్): ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా మిషన్ భగీరథ నీళ్ల తాగాలని ఎంపీపీ మాలోతు లక్ష్మి పిలుపునిచ్చారు. ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఆమె అధ్యక్షతన తాగునీటి ఎద్దడి నివారణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కట్కూర్, మోత్కులపల్లి గ్రామాల్లో మిషన్ భగీరథ నీళ్ల రావట్లేదని పంచాయతీ కార్యదర్శులు గుగులోతు మోహన్, కార్తీక్ సభ దృష్టికి తీసుకువచ్చారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని వాపోయారు. దీంతో తాగునీరు ఇక్కట్లు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ఏ ఒక్క తండాలోను తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. మల్లపల్లి, మోత్కులపల్లి, కట్కూర్ గ్రామాలతో పాటు తదితర గ్రామాల్లో నేటికీ భగీరథ నీళ్లు రాకపోవడంతో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా ఎంపీడీఓ జయరామ్ దృష్టికి తేవాలని సూచించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్, వ్యవసాయశాఖ ఏడీ మహేశ్, ఎంపీడీఓ భానోతు జయరాం, ఎంపీఓ కవికుమార్, ఏఈ మౌనిక, ఇరిగేషన్ ఏఈ రమ్యశ్రీ, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం

- సగానికి పైగా అధికారులు గైర్హాజరు
- నామమాత్రంగానే చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

సిద్దిపేటఅర్బన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగానే జరిగింది. సోమవారం సిద్దిపేట ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ప్రజా ప్రతినిధులతో పాటు సగానికి పైగా అధికారులు గైర్హాజరయ్యారు. ఉన్నవారితో నామమాత్రంగానే చర్చించి సమావేశాన్ని ముగించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, నీరు, విద్యుత్ సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని వైస్ ఎంపీపీ అల్లం ఎల్లమ్ సూచించారు. వ్యవసాయశాఖ అధికారులు మాట్లాడుతూ మూడు ఎకరాల తొమ్మిది గుంటలకు మాత్రమే రైతుబంధు వచ్చిందని మిగతా వారికి త్వరలో వచ్చే అవకాశం ఉందని తెలిపారు. భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల మొగిపురుగు వ్యాప్తి చెందడంతో ఈసారి పంట దిగుబడి తగ్గే అవకాశం ఉందని చెప్పారు. ప్రతిసారి సమావేశం తూతూ మంత్రంగానే నిర్వహించడంపై కొంతమంది ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీఓ మార్టిన్ లూథర్, ఎమ్మార్వో సలీం, ఎంపీఓ శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తాం

కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్త



మాట్లాడుతున్న శ్రీనివాస్‌గుప్త

ములుగు(గజ్వేల్): గడ్డు కాలంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేసిన తనను హఠాత్తుగా పార్టీ మండల అధ్యక్ష పదవి నుంచి తొలగించడం అప్రజాస్వామికమని ములుగు మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు గంగిశెట్టి శ్రీనివాస్‌గుప్త ఆవేదన వ్యక్తం చేశారు. వంటిమామిడి వద్ద ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ములుగు మండలానికి నూతన అధ్యక్షుడిని నియమిస్తున్నట్లు ప్రకటిస్తూ డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తప్పుబట్టారు. ఏకపక్షంగా తనను తొలగిస్తూ తీసుకున్న నిర్ణయంపై అధిష్టానానికి, సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తామన్నారు. మాజీ ఎంపీపీ వెంకట్‌రాంరెడ్డి, పార్టీ నాయకులు బద్రయ్య, నల్లశ్రీను తదితరులు పాల్గొన్నారు.

ములుగు కాంగ్రెస్ అధ్యక్షుడిగా శ్రీనివాస్



శ్రీనివాస్‌కు నియామకపత్రం అందజేస్తున్న నర్సారెడ్డి

ములుగు(గజ్వేల్): కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మామిడ్యాల గ్రామానికి చెందిన తమ్మల శ్రీనివాస్ నియామకమయ్యారు. సోమవారం ములుగులో ఆయనకు డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి నియామకపత్రం అందజేశారు. అలాగే జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడుగా ములుగుకు చెందిన రమేశ్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయనకు కూడా నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీధర్ రెడ్డి, గణేశ్‌యాదవ్, ఎడ్ల పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా ముందుకు సాగుదాం

టీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్



జగదీశ్వర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న జిల్లా ప్రతినిధులు

సిద్దిపేటజోన్: సమష్టిగా పనిచేసి ప్రభుత్వ పథకాల లక్ష్యాలను అధిగమిద్దామని టీఎన్జీవో రాష్ట్రశాఖ నూతన అధ్యక్షుడు జగదీశ్వర్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లాశాఖ అధ్యక్షుడు పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జగదీశ్వర్‌ను కలిసి అభినందించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. పట్టణంలో పలుచోట్ల వాహనాల తనిఖీ నిర్వహించగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ 26 మంది పట్టుబడ్డారన్నారు. వారిని కోర్టులో హాజరుపర్చగా సోమవారం విచారించిన జడ్జి శ్రావణి వారికి రూ.9,900 జరిమానా విధించారని చెప్పారు.

సంక్షిప్త వార్తలు

◆ చెరువులు నింపి రైతులను ఆదుకోవాలి

కొమురవెల్లి(సిద్దిపేట): కాలువల ద్వారా చెరువులన్నింటినీ నింపి రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పలువురు కార్యకర్తలతో కలసి ఆయన తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా చెరువులు నింపి ఆదుకోవాలన్నారు.

◆ పండుగలను ప్రశాంతగా జరుపుకోవాలి

మిరుదొడ్డి(దుబ్బాక): పండుగలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని ఎంపీపీ గజ్జెల సాయిలు కోరారు. మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో సోమవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. మతాలకతీతంగా ఒకరికొకరు సహకరించుకుంటేనే పండుగలు ప్రశాంతంగా జరుగుతాయన్నారు. హెడ్ కానిస్టేబుల్ ప్రమోద్, మాజీ సర్పంచ్ బాలరాజు, అహ్మద్ పాల్గొన్నారు.

◆ ఈజీఎస్ పనుల పరిశీలన

మద్దూరు(హుస్నాబాద్): వంగపల్లిలో ఈజీఎస్‌లో నిర్వహిస్తున్న భూ అభివృద్ధి పనులను సోమవారం ఎంపీడీఓ రామ్మోహన్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎండలు పెరుగనున్నందున ఉదయం వేళల్లో పనులు ముగించుకోవాలని సూచించారు. ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను అందుబాటులో ఉంచాలని, నర్సరీలో షేడ్ నెట్ వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు పాల్గొన్నారు.

◆ పాల బిల్లులు చెల్లించాలి

గజ్వేల్‌రూరల్: పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను వెంటనే చెల్లించి తమను ఆదుకోవాలని పాడి రైతులు డిమాండ్ చేశారు. సోమవారం విజయమిల్క్ చిల్లింగ్ సెంటర్ వద్ద జగదేవ్‌పూర్ మండలం తీగుల్‌కు చెందిన పలువురు పాడి రైతులు ఆందోళనకు దిగారు. అనంతరం చిల్లింగ్ సెంటర్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. 2నెలల నుంచి బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. రైతులు కన్నా, భాస్కర్, రాంబాబు, ప్రభాకర్, స్వామి, రవీందర్‌రెడ్డి, మల్లేశం తదితరులున్నారు.

◆ సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

బెజ్జంకి(సిద్దిపేట): లక్ష్మీపూర్‌లో ఎంఎస్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5లక్షలతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణం పనులకు సోమవారం బెజ్జంకి జెడ్పీటీసీ కనగండ్ల కవిత శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్‌కుమార్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ ఉన్నత స్థానాల్లో నిలిచినపుడే గుర్తింపు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలిచినపుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని పల్లెపహాడ్ గ్రామ యువజన నాయకుడు కొమ్ము నరేశ్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోగల జెడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు.



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, పోలీస్ సిబ్బంది

శాంతిభద్రతల పరిరక్షణకే ఫ్లాగ్ మార్చ్

ఏసీపీ సతీశ్

హుస్నాబాద్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు ఏసీపీ సతీశ్ తెలిపారు. కేంద్ర బలగాలు సీఐఎస్ఎఫ్‌తో కలిసి ఆయన పట్టణంలో సోమవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా, అక్కన్నపేట రోడ్, మల్లెచెట్టు చౌరస్తా, కరీంనగర్, హన్మకొండ, సిద్దిపేట, ఎల్లమ్మ టెంపుల్ రోడ్‌లతోపాటుగా ఇతర ప్రాంతాల్లో ఈ ఫ్లాగ్ మార్చ్ కొనసాగింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఓటుహక్కు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నచ్చిన వ్యక్తికి, ఓటువేసే ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పిస్తామని ఏసీపీ సతీశ్ తెలిపారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, చేర్యాల సీఐ శ్రీను, ఎస్ఐలు మహేశ్, వివేక్, తిరుపతి, దామోదర్, షేక్ యూనస్ అహ్మద్ అలీ, నాగరాజు, డివిజన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌బీఐ చైర్మన్‌ను అరెస్టు చేయాలి

సీపీఎం నేతల డిమాండ్



చేర్యాల(సిద్దిపేట): ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

చేర్యాల(సిద్దిపేట): సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఎస్‌బీఐ చైర్మన్ ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని, మోదీ ప్రజా వ్యతిరేక విధానాలకు వత్తాసు పలుకుతున్న ఎస్‌బీఐ చైర్మన్‌ను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎస్‌బీఐ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల బాండ్ల రూపంలో ఎస్‌బీఐ ద్వారా ఎవరెవరు ఎంత ఇచ్చారనే వివరాలను తక్షణమే బహిర్గతం చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. నాయకులు నాగరాజు, అరుణ్‌కుమార్, ప్రభాకర్, మల్లేశం, నర్సిరెడ్డి, శోభ, రవీందర్, అశోక్, సత్యనారాయణ, రామచంద్రం, నారాయణ, మల్లయ్య పాల్గొన్నారు.

బాండ్ల ద్వారా రూ.3600 కోట్ల లబ్ధి

గజ్వేల్‌రూరల్: ఎలక్ట్రోల్ బాండ్లపై సమాచారం అందుబాటులో లేదంటూ సుప్రీంకోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చిన ఎస్‌బీఐ చైర్మన్‌ను అరెస్టు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఎస్‌బీఐ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాండ్ల ద్వారా బీజేపీ రూ.3600 కోట్ల లబ్ధి పొందిందని ఆరోపించారు. రంగారెడ్డి, వెంకట్‌చారి, అఫ్జల్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

వివరాలను వెల్లడించాలి

దుబ్బాక: ఎన్నికల బాండ్ల వివరాలను తక్షణమే వెల్లడించాలంటూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ఎస్‌బీఐ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు గొడ్డుబర్ల భాస్కర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ ఎన్నికల పూర్తయ్యేంత వరకు వివివరాలను రహస్యంగా ఉంచేందుకు ప్రయత్నించడం సిగ్గు చేటని మండిపడ్డారు.

ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఖతం

కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన బీఎస్పీ నేత మల్లేశం యాదవ్, కాల్వ నరేశ్ తదితరులు

దుబ్బాకటౌన్: పార్లమెంట్ ఎన్నికల తర్వాత తెలంగాణలో బీఆర్ఎస్ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ నుంచి దుబ్బాక అసెంబ్లీకి పోటీచేసిన సల్కం మల్లేశం యాదవ్, దుబ్బాక పీఏసీఎస్ వైస్ చైర్మన్‌కాల్వ నరేశ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మల్లుగారి చంద్రారెడ్డి, రామక్కపేట మాజీ సర్పంచ్ రాచకట్ల మైసరాజు, మాజీ ఉపసర్పంచ్ భూపాల్‌గౌడ్, అక్బర్‌పేట–భూంపల్లి మండలానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు భూంపల్లి భీంరావ్ తమ అనుచరులతో కాంగ్రెస్‌లో చేరారు. శ్రీనివాస్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని చేరికలు ఉంటాయన్నారు. ఎంపీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పూర్తిగా ఖాళీ అవుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు మోదీ కృషి

మహిళా మోర్చా రాష్ట్ర నేత శిల్పారెడ్డి



కళాకారిణిని సన్మానిస్తున్న శిల్పా రెడ్డి తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మహిళా సాధికారత కోసం మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా అధ్యక్షురాలు ఉమ ఆధ్వర్యంలో సోమవారం సిద్దిపేటలోని శివానుభవ మండపంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడం కోసం కేంద్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. మహిళలు రాజకీయంగా ఎదగాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మహిళా నేతలు సుధ, తోకల ఉమా రాణి, లక్కిరెడ్డి తిరుమల, స్వరూప, పద్మ, విభీషణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటిగల్ చెరువులో హుండీ లభ్యం

మద్దూరు(హుస్నాబాద్): ధూళిమిట్ట మండలంలోని కూటిగల్‌నల్ల చెరువులో సోమవారం ఓ హుండీ లభ్యమైంది. మత్స్యకారులు కూటిగల్ నల్లచెరువులో చేపలు పడుతుండగా సుమారు 20కిలోల స్టీల్ హుండీ లభించింది. దొంగలు ఎవరో ఏదో ఆలయంలో హుండీని దొంగిలించి తాళాలు పగులగొట్టి డబ్బులు, కానుకలు తీసుకొని చెరవులో పడేసి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. చెరువులో నీటి మట్టం తగ్గడంతో హుండీ బయట పడిందని భావిస్తున్నారు. హుండీని స్థానిక పెద్దమ్మ ఆలయంలో భద్రపరిచారు. పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం

డీసీఎం ఢీకొని ఆటో బోల్తా

భార్యాభర్తలకు గాయాలు



గాయపడిన రఘురాములు

కొండపాక(గజ్వేల్): ఆటోను డీసీఎం ఢీకొట్టిన ఘటనలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని వెలికట్ట గ్రామ శివారులో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మదూరి రఘురాములు తన భార్యతో కలిసి సొంత ఆటోలో సిద్దిపేటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెలికట్ట గ్రామ శివారులో రాజీవ్ రహదారిపై హైదారాబాద్ నుంచి సిద్దిపేటకు వెళ్తున్న డీసీఎం ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తాపడడంతో రఘురాములుకు తీవ్ర గాయాలవ్వగా భార్య ఊర్మిళకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న టోల్ ప్లాజా అంబులెన్సు సిబ్బంది వారిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జీరో కరెంట్ బిల్లుల కోసం బారులు

హుస్నాబాద్: జీరో విద్యుత్ బిల్లుల రాని వారు దరఖాస్తులు అందజేసేందుకు బారులు తీరారు. గృహలక్ష్మి పథకం కింద 200 యూనిట్లు దాటిన వారికి ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు దరఖాస్తులను స్వీకరించారు. చాలా మందికి ఆ బిల్లులు రాలేదు. సోమవారం మున్సిపల్ కార్యాలయం, బస్తీ దవాఖాన గోదాంగడ్డ, మున్సిపల్ కాంప్లెక్స్‌ల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో బారులు తీరారు.